క్లుప్తంగా

వరసిద్ధుని సేవలో ఆర్కే రోజా



స్వామి ప్రసాదం అందుకుంటున్న మాజీ మంత్రి రోజా

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామిని మంగళవారం మాజీ మంత్రి రోజా దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మాజీ చైర్మన్ మోహన్‌రెడ్డి, సిబ్బంది ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆమెకు ఆశీర్వచనం పలికారు. స్వామి వారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

మోటారు వాహనాల చట్టంపై అవగాహన

పాలసముద్రం : మండలంలోని బలిజకండ్రిగ వద్ద మంగళవారం పలువురు ద్విచక్రవాహనదారులకు మోటారు వాహనాల చట్టంపై పోలీసులు అవగాహన కల్పించారు. ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప మాట్లాడుతూ కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తితోపాటు వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. లేకుంటే రూ.వెయ్యి జరిమానా విధిస్తామన్నారు. ఆటోడ్రైవర్లు వాహన పత్రాలను ఉంచుకోవాలని, యూనిఫామ్ ధరించాలని స్పష్టం చేశారు. మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ మునస్వామి, రవి పాల్గొన్నారు.

బాధ్యతగా విధులు నిర్వర్తించండి

పాలసముద్రం : మండలంలోని ఆశా కార్యకర్తలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ ఆదేశించారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించాలన్నారు. గర్భిణులకు అందుబాటులో ఉండాల ని సూచించారు. వేసవి ప్రారంభమవుతున్న నేపథ్యంలో గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే ప్రసవం చేయించాలని స్పష్టం చేశారు. సమావేశంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్లు సుశీల, మురళి తదితరులు పాల్గొన్నారు.

టీకాలతోనే ఆరోగ్యం



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా టీకాల అధికారి

నింద్ర: వ్యాధి నిరోధక టీకాలతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా టీకాల అధికారి హనుమంతురావు అన్నారు. మంగళవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. వైద్య సిబ్బందితో మాట్లాడారు. రెండేళ్ల పిల్లందరికీకి టీకాలు వేయించాలని, గర్భవతుల నమోదు పూర్తి చేయాలని ఆదేశించారు.

సాఫ్ట్ స్కిల్స్‌తోనే విజయం



నైపుణ్యాలపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

నగరి : పోటీ ప్రపంచంలో విజయం సాధించాలంటే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్, మేనేజ్‌మెంట్ స్కిల్స్ పెంపొందించుకోవాలని పుత్తూరు శ్రీ వెంకటేశ పెరుమాల్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఇంగ్లిష్ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్.దేవరాజులు రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల్ ఆహ్వానం మేరకు దేవరాజులురెడ్డితో పాటు మేనేజ్‌మెంట్ స్టడీస్ హెడ్ డాక్టర్ హరుణ్ అతిథి ఉపన్యాసమిచ్చారు. స్థిరమైన అభ్యసనంతోపాటు ఇంగ్లిష్ క్లబ్ కార్యకలాపాల్లో పాల్గొంటూ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆంగ్ల విభాగం ఇన్‌చార్జి రేవతి, ఆంగ్ల అధ్యాపకురాలు డాక్టర్ ఎం.పంకజ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

నింద్ర: పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకుంటే అవి ఆరోగ్యంగా ఉంటాయని ఆరూరు పశువైద్యశాల వైద్యాధికారి ప్రభాకర్‌వర్మ అన్నారు. మంగళవారం ఆరూరులో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ, మండలంలో ఈ నెలాఖరు వరకు టీకాలు వేస్తామని, రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాత దిగుబడి తగ్గడం, జ్వరం, చొంగ కారడం, కుంటడం.. వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం పశు వైద్యులను సంప్రదించి చికిత్స చేయించాలని కోరారు.

నోటీస్ బోర్డు

- పాలసముద్రం మండలంలోని అన్ని ఆరోగ్య ఉపకేంద్రాల్లో గర్భిణులకు బుధవారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు.
- పాలసముద్రం మండలం శ్రీకావేరిరాజుపురం, ఆముదాల రైతు సేవా కేంద్రాల్లో బుధవారం ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఢిల్లీ ప్రసాద్ తెలిపారు.
- పాలసముద్రం మండలం నరసింహాపురం గ్రామ సచివాలయంలో బుధవారం ఆధార్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డి తెలిపారు. ఆరేళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు చేయించుకోవచ్చని సూచించారు.

స్పందనకు చెల్లుచీటీ..!

- సచివాలయాల్లో జాడే లేదాయె..!
- అవస్థల నడుమ మండల, జిల్లా కేంద్రానికి పరుగులు తీస్తున్న అర్జీదారులు
- ప్రజా సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం



కోసలనగరం సచివాలయం

విజయపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు సుపరిపాలన అందించాలన్న లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి 2వేల కుటుంబాలకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. అలాగే ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్పందన కార్యక్రమం అమలు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో రోజూ మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల వరకూ పంచాయతీ కార్యదర్శితో పాటు సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందనకు హాజరయ్యేవారు. గ్రామంలో ఏ సమస్య ఉన్నా స్థానికంగా రోజూ గంట పాటు నిర్వహించి, ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించేవారు. దీంతో జిల్లా, మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చాక స్పందన కార్యక్రమానికి స్వస్తి పలికింది. దీనికి పేరు మార్చి మండల స్థాయిలో «ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక» నిర్వహిస్తూండడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. గ్రామాల నుంచి మండల కేంద్రానికి, మండల కేంద్రంలో సరైన స్పందన లేకపోతే జిల్లా కలెక్టరేట్‌కు అవస్థల నడుమ పరుగులు తీసి తమ సమస్యలు నివేదించుకోవాల్సి వస్తోంది.

తిష్ట వేస్తున్న సమస్యలు

గ్రామాల్లోని సమస్యలను అధికారులకు నివేదించేందుకు మండల కేంద్రానికి వెళ్లాల్సి రావడంతో చాలామంది సమస్యలను చెప్పుకోలేకపోతున్నారు. దీంతో అయా గ్రామాల్లోని సమస్యలు తిష్ట వేస్తున్నాయి. ప్రధానంగా భూ సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వ పాలనలో మండల కేంద్రంలోనే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తూండడంతో వృద్ధులు, మహిళలు, దివ్యాంగులు వెళ్లలేకపోతున్నారు.

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి దూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. రానుపోనూ బస్సు చార్జీలు పెట్టు కోవాల్సి వస్తోంది. ప్రజలకు ఇబ్బంది కలగకుండా గ్రామస్థాయిలోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తే అందరికీ ఉపయుక్తంగా ఉంటుంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, పూడి, వడమాలపేట

'స్పందన' కొనసాగించాలి



ప్రజా సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే సచివాలయాల్లోనూ స్పందన (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) కార్యక్రమం నిర్వహించాలి. దీనిని నీరుగార్చకుండా అధికారులు గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి.

– టి.ప్రతాప్, మాజీ వైస్ ఎంపీపీ, పుత్తూరు

అందుబాటులో ఉండాలి

సచివాలయాల్లో స్పందన కోసం ప్రత్యేకంగా కౌంటర్ అంటూ ఏదీ లేదు. తప్పనిసరిగా ప్రతి సోమవారం సచివాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండాలి. ప్రజలు ఇచ్చే అర్జీలను స్వీకరించి పరిష్కరించాలి. అందుబాటులో లేకుంటే ఫిర్యాదు చేయవచ్చు

– రాజేంద్ర, ఈఓపీఆర్‌డీ, విజయపురం

ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లతో డీఎస్పీ

నగరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ సీజ్ చేశారు. రాత్రిళ్లు నదిలో ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో మంగళవారం తెరణి ప్రాంతంలో కుశస్థలి నది వద్ద ఆయన ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. వాటి రికార్డులను పరిశీలించారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్టు తెలుసుకుని వాటిని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో పలుమార్లు హెచ్చరించినా ఇసుక రవాణాదారులు బేఖాతరు చేస్తున్నారని, ఇక ఉపేక్షించేది లేదన్నారు. తరచూ ఆకస్మిక తనిఖీ చేసి, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

భూసార పరీక్షలతో ఎరువుల వాడకం

నింద్ర: మండలంలోని రైతులు తమ పొలాల్లో భూసార పరీక్షలు చేసి వాటి ఆధారంగా ఎరువులు వాడాలని వ్యవసాయాధికారి తులసీరాం అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూసార పరీక్షలు చేస్తే ఆయా పొలాలు, భూముల్లో లోపాలేమిటో గుర్తించి, వాటి నివారణకు అవసరమైన పోషకాలు అందివ్వచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



చిరుధాన్యాలపై అవగాహన సదస్సు

పుత్తూరు : నిత్యం మనం తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని టాటా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సంతోషి అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఐసీడీఎస్ కార్యాలయంలో మై హెల్తీ ప్లేట్, చిరు ధాన్యాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సంతోషితోపాటు సూపర్ వైజర్ సంధ్య మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పౌష్టిక విలువలు కలిగిన చిరుధాన్యాల వినియోగాన్ని అలవాటుగా చేసుకోవాలని కోరారు. దీని వల్ల ఆరోగ్య పరిరక్షణ బాటలు వేసుకోవచ్చని, అలాగే జన్యుపరంగా సంక్రమించే పలు వ్యాధులు కూడా దూరమవుతాయన్నారు. దేశంలో తొమ్మిది రకాల చిరుధాన్యాల సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్దేశించిందన్నారు.

పోషకాహారంపై అవగాహన



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మసునంద

కార్వేటినగరం : మండలంలోని కొల్లాగుంట అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం మహిళలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ పద్మసునంద మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, యుక్తవయసు బాలికలకు శారీరక వ్యాయామం తప్పనిసరన్నారు. రక్తహీనత నిర్మూలనకు పోషకాలతో కూడిన ఆహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో పోషకాలతో కూడిన ఆకుకూరలను పండించి పిల్లలకు అందించాలని స్పష్టం చేశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు శామిని, ఇందిరా, అంగన్‌వాడీ వర్కర్ వళ్లెమ్మ పాల్గొన్నారు.



బాడీ బిల్డర్‌కు నగదు సాయం చేస్తున్న డీఎస్పీ

బాడీ బిల్డర్‌కు ఆర్థిక సాయం

నగరి: పుత్తూరుకు చెందిన బాడీ బిల్డర్ దినేష్‌కు డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ ఆర్థిక సాయం అందజేశారు. పళ్లిపట్టులో నిర్వహించే బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేందుకుగాను శిక్షణ నిమిత్తం, అలాగే పౌష్టికాహారం తీసుకోవడానికి ఆయన ఈ సాయం చేశారు. పోటీలో విజయం సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ మహేశ్వర్ పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

–ధర్నాలో ఆటో కార్మికుల డిమాండ్



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

నగరి : ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఎన్నికల హామీ మేరకు వాహన మిత్ర పథకంలో రూ.15వేలు ఇవ్వాలని, పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఏఐటీయుసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య డిమాండ్ చేశారు. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు అంబేడ్కర్ విగ్రహం నుంచి ర్యాలీగా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి ధర్నా చేశారు. కోదండయ్య మాట్లాడుతూ, అధికారంలో వచ్చిన కూటమి ప్రభుత్వం 9 నెలలు కావస్తున్నా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆటో, టాక్సీ డ్రైవర్లకు హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కార్మికులకు నష్టం కలిగించే జీవోలు 21,31లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీఓ భవాని శంకరికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సీనియర్ నాయకుల వేలన్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు శేఖర్, ప్రకాష్, ఏసు, రవి, బాషా, విజయ్ కుమార్, రవి శేఖర్, ప్రకాష్, లాజర్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అనవసరంగా విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్

కార్వేటినగరం : నీతికి, నిజాయితీకి నిదర్శనంగా నిలిచే మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై అనవసర విమర్శలు చేస్తే సహించే ప్రసక్తే లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు హెచ్చరించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. టీడీపీ స్థానిక నేత బీగాల రమేష్ తన స్థాయిని మరచి అత్యున్నత హోదాలో పనిచేసిన నారాయణస్వామిని విమర్శించగం తగదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు బహిరంగంగా ప్రతిపక్ష నేతలకు చిన్నపని కూడా చేయవద్దని ఆదేశించడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. దీనిపై ప్రతిపక్షాలు మాట్లాడితే విమర్శలకు దిగడం సరికాదన్నారు. ఎస్సీసెల్ కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో డిప్యూటీ సీఎంగా నారాయణస్వామి చేసిన అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తోందని తెలిపారు. జగనన్న కాలనీల పేరుతో పెద్ద గ్రామాలనే ఏర్పాటు చేసిన ఘనత నారాయణస్వామిదేనన్నారు. పురాతన ఆలయాలకు పునరుజ్జీవం పోశారన్నారు. అధికారం ఉందని నోటికొచ్చినట్లు మాట్లాడితే, రాబోయే రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సర్పంచ్ ధనుంజయవర్మ, సింగిల్‌విండో మాజీ చైర్మన్ లోకనాథరెడ్డి, శేషాద్రి, పురుషోత్తం రాజు, వెంకటేష్, సుబ్రమణ్యం, మునికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రాజా పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



కేబీఆర్ పురంలో వడివేలును పరామర్శిస్తున్న మాజీ మంత్రి రోజా

పుత్తూరు: పుత్తూరు రూరల్ మండలం, కేబీఆర్‌పురానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు వడివేలు తల్లి, అలాగే గోపాలకృష్ణాపురం సర్పంచ్ వేలాయుధం తల్లి, పుత్తూరులోని భాస్కర్‌రాజు ఇటీవల మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను మంగళవారం మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జయప్రకాష్ (చిట్టి), సీనియర్ నాయకుడు కేటీ ప్రసాద్, అడ్వొకేట్ రవీంద్ర, మాజీ వైస్ ఎంపీపీ ప్రతాప్, మండల కన్వీనర్ అన్నలోకం, ఎస్సీ సెల్ యూత్ అధ్యక్షుడు లక్ష్మణమూర్తి, హరి, రవి, బాబు తదితరులు పాల్గొన్నారు.

మృత్యు 'మలుపులు'

అత్యవసరమని ఎక్కడికైనా వెళ్లేందుకు వాహనాలను నడిపితే అంతే సంగతులు..గమ్యం చేరడం గగనమే. ఒక్క క్షణం ఏమరుపాటుగా వ్యవహరిస్తే ప్రాణాలు గాల్లో కలిసిపోవాల్సిందే. మండలంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న మలుపులతో ప్రజలు ముప్పు తిప్పలు పడుతున్నారు. ప్రయాణం ప్రమాదకరంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. ఇరుకు రోడ్లకు తోడు మలుపులు అధికంగా ఉండడంతో హడలిపోతున్నారు. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై మండిపడుతున్నారు.

- ప్రమాదకరంగా రహదారులు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- బావులున్న చోట లేని రక్షణ గోడలు
- ఆందోళనలో ప్రయాణికులు



వెదురుకుప్పం సమీపంలో ఇలా..

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంట నుంచి దేవళంపేట వైపుగా చిత్తూరు, చవటగుంట నుంచి తిరుపతి, పెనుమూరు నుంచి చవటగుంట, పచ్చికాపల్లం, కార్వేటినగరం మీదుగా పుత్తూరుకు ప్రధాన రహదారులు ఉన్నాయి. పచ్చికాపల్లం నుంచి తిరుపతి వరకు రోడ్డు వెడల్పుగా ఉంది. అయితే పచ్చికాపల్లం నుంచి దేవళంపేట మీదుగా కొత్తపల్లె మిట్ట, పెనుమూరు-కార్వేటినగరం రోడ్లు నేటికీ విస్తరణకు నోచుకోలేదు. దీనికితోడు రహదారుల్లో ఎక్కడ చూసినా ప్రమాదకర మలుపులు ఉన్నాయి. కొన్ని చోట్ల రోడ్ల పక్కన బావులు ఉన్నాయి. ఆదమరిచి వాహనాలను నడిపితే ఎలాంటి ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందో అని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. వెదురుకుప్పం మండల కేంద్రం నుంచి దేవళంపేట వరకు సుమారు 16 చోట్ల ప్రమాదకర మలుపులు ఉన్నాయి. పెరుమాళ్లపల్లె సమీపంలో రోడ్డు పక్కనే బావి ఉంది. తిరుమలయ్యపల్లె, పెరుమాళ్లపల్లె, పెద్దబైలు సమీపంలో రహదారికి ఆనుకుని చెరువులు ఉన్నాయి. వెదురుకుప్పం నుంచి పెనుమూరు వైపు ఎక్కడ చూసినా రోడ్డు పక్కనే బావులు అధికంగా ఉన్నాయి. పాతగుంట సమీపంలోని దొర్ణకంబాల , తాటిమాకుల పల్లె రోడ్డు పక్కన, నల్లవెంగనపల్లె వద్ద ప్రమాదకరంగా బావులు ఉన్నాయి. వెదురుకుప్పం నుంచి పచ్చికాపల్లం వరకు పాలకుంట చేను, దామరకుప్పం వద్ద రెండు చోట్ల బావులు ఉన్నాయి. జక్కిదొన వద్ద రోడ్డును ఆనుకుని చెరువు ఉంది. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి రక్షణ గోడలు నిర్మించిన పాపాన పోలేదు. పచ్చికాపల్లం నుంచి కార్వేటినగరం వైపు ధర్మాచెరువు, కసవనూరు, మత్రిమాకుల కండ్రిగ వద్ద ప్రమాదకర మలుపులు ఉన్నాయి.

ఆదమరిస్తే అంతే..

గ్రామీణ ప్రాంతాలను కలుపుతూ పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారులేక్ష మలుపులు, ముళ్ల పొదల్ల చాటున బావులతో ప్రయాణికులు ముప్పుతిప్పలు పడుతున్నారు. క్షణం ఏమారితే ఏగోతిలో పడడమో లేక చెట్టును ఢీకొట్టడమో జరగడం పరిపాటైంది. మండలంలో ఎక్కువగా మలుపుల వద్ద, చెరువుల వద్ద జరిగిన ప్రమాదాలే అధికం. నిత్యం ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల పచ్చికాపల్లంపేట వద్ద ఉన్న మలుపులో చిత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ముత్యాలమ్మ ఆలయం ప్రహరీ గోడను ఢీకొని ప్రధాన రహదారిలో ఆగిపోయింది. ప్రమాదం జరిగిన చోట ముత్యాలమ్మ కుంట ఉంది. అందులో పడి ఉంటే ప్రమాద తీవ్రతను ఊహించలేమని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం మలుపుల్లో ఎక్కడ కూడా హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయలేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు భవనాల శాఖఅధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయని విమర్శిస్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అలసత్వాన్ని వీడడం లేదని మండిపడుతున్నారు.



పాతగుంట సమీపంలో ప్రమాదకరంగా ఉన్న బావి



దేవళంపేట రోడ్డులో తంగేళిమిట్ట వద్ద మద్దెలవంక మలుపు



పచ్చికాపల్లం మలుపు వద్ద బస్సు ప్రమాదం(ఫైల్)